
ప్రజాశక్తి
ఆదివారం 25 డిసెంబర్ 2022
5
విజయనగరం



పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజ హితం కోసం చేసే ప్రతి కార్యక్రమానికీ తమ కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ దంపతులు అన్నారు. ఈ మేరకు వారి కుమార్తె, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మనుమరాలు యశ్విక పుట్టినరోజును కోలగట్ల నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అయ్యన్నపేటలో చంద్రమౌళీశ్వర ఆలయానికి రూ.లక్ష, కొత్తపేటలోని స్వీపర్ వీధిలో రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళాలను అందజేశారు. రింగ్ రోడ్డు ఆర్కె నగర్‌లోని 200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కోలగట్ల వీరభద్రస్వామి సతీమణి వెంకటరమణి పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కోలగట్ల శ్రావణి

ఇసుక దందా.. సెటిల్‌మెంట్లు

- దోచుకుతింటున్న బొత్స కుటుంబ సభ్యులు
- ఎమ్మెల్యే రౌడీయిజానికి భయపడొద్దు
- మరో ఛాన్సు ఇచ్చి మోసపోవద్దు
- టిడిపి అధికారంలోకి వస్తే అన్ని తరగతులకూ న్యాయం
- విజయనగరం బహిరంగ సభలో నిప్పులు చెరిగిన చంద్రబాబు



ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/టౌన్,కోట,గజపతినగరం

ఇసుకదందా, సెటిల్‌మెంట్లు, భూకబ్జాలతో విజయనగరం జిల్లాను మంత్రి బొత్స సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు దోచుకుంటున్నారని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు. జిల్లాలో ప్రతి పనికీ లంచాలకు పాల్పడటం అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే సెంటు భూమి కోసం రౌడీయిజం చేస్తున్నారన్నారు. వీరి ఆగడాలకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తాను అధికారంలోకి వస్తే అందరికీ అండగా నిలబడతానని భరోసానిచ్చారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా విజయనగరంలోని కోట జంక్షన్‌లో శనివారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రపై రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి పెత్తనం చెలాయిస్తే ఈ ప్రాంతానికి చెందిన మంత్రి బొత్స రోషం లేనివాడిలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవాచేశారు. ఈ ప్రాంత బిసిలను రాజకీయంగా మభ్యపెట్టి, ప్రజల్ని లూటీ చేస్తుంటే అచేతనంగా ఊరుకోవడం తగునా? అని ప్రశ్నించారు. తన పాలనలో ఉత్తరాంధ్ర మంత్రుల చేసే పనుల్లో తాను ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని గుర్తుచేశారు. అశోక్ గజపతిరాజు నీతి, నిజాయతీ గల వ్యక్తి అని, ప్రజలకు సేవ చేయడం తప్ప మోసం చేయడం రాదని కితాబిచ్చారు. అటువంటి నాయకుడిపై తప్పుడు కేసులు పెట్టిన వైసిపి ప్రభుత్వం ఏం సాధించిందని ప్రశ్నించారు. రామతీర్థంలో రాముడి శిరస్సు ఖండించినప్పుడు జిల్లాకు రాగానే తనపైనా కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఇటువంటి నేతలను తాను తలచుకుంటే బజారులో బట్టలూడదీయగలనని వ్యాఖ్యానించారు. చంపావతి నదిలో ఇసుకను స్థానిక ఎమ్మెల్యే దోపిడీ చేస్తున్నారని, ఇందులోని ముడుపులు జగన్‌కు వెళ్తున్నాయని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం మద్యపాన నిషేధం హామీ నెరవేర్చలేదని, బిల్లులు, ఆన్‌లైన్ లావాదేవీలేవీ లేకుండా మద్యం వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. విశాఖపైన ప్రేమలేదని, జగన్ ప్రేమంతా విశాఖలోని భూములు, ప్రజల ఆస్తులు, రుషికొండపైనే అన్నారు. గత ఎన్నికల్లో ఒక్క ఛాన్సు ఇచ్చినందుకు రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి పోయిందని, ఇలాంటి ప్రభుత్వానికి మళ్లీ అవకాశం కల్పించి మోసపోవద్దని కోరారు.



జనాలనుద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

అడుగడుగునా అపూర్వ స్వాగతం

చంద్రబాబుకు అడుగడుగునా టిడిపి నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. మూడో రోజు బొబ్బిలి కోట నుంచి ప్రారంభమైన చంద్రబాబు రోడ్‌షో రామభద్రపురం, మానాపురం, గజపతినగరం, బొండపల్లి మీదుగా విజయనగరం చేరింది. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు ఆధ్వర్యాన గజమాలతో చంద్రబాబుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. తులసివనంలో గంజాయి మొక్కలా ప్రశాంతంగా ఉన్న విజయనగరం జిల్లాలో బొత్స సత్యనారాయణ తయారయ్యారని ధ్వజమెత్తారు. బొత్స సోదరుడు, ఎమ్మెల్యే అప్పలనర్సయ్య బందిపోటులా తయారై, ఇసుక దొంగలా మారి దందా చేస్తున్నారని విమర్శించారు. నేషనల్ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ కౌన్సిల్ ద్వారా నిధులు తీసుకొచ్చి భీమసింగి చక్కెర పరిశ్రమను అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. విజయనగరం నగర పరిధిలోని కెఎల్‌పురం వద్ద టిడిపి శ్రేణులు చంద్రబాబు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి కలెక్టరేట్, బాలాజి మార్కెట్, ఎన్‌సిఎస్ థియేటర్, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్థంభం, మూడు లాంతర్ల కూడలి మీదుగా కోట జంక్షన్‌కు చేరుకున్నారు.

వ్యవసాయం, గ్రామాలాభివృద్ధే టిడిపి లక్ష్యం



రైతు సమస్యలపై చంద్రబాబుతో చర్చిస్తున్న బేబినాయన

బొబ్బిలి : టిడిపి అధికారంలోకి వస్తే వ్యవసాయం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శనివారం బొబ్బిలికోటలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అధ్యక్షతన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చంద్రబాబు దృష్టికి రైతులు, టిడిపి నాయకులు తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ రీసర్వేతో రైతులకు నష్టమని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్దకే వెళ్లి ధాన్యం కొనే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లు పెట్టడం అన్యాయమన్నారు. టిడిపి రాష్ట్ర కమిటీలో బొబ్బిలి మండలం పారాది మాజీ సర్పంచ్ అల్లాడ భాస్కరరావు, రామభద్రపురం ఉప సర్పంచ్ చింతల రామకృష్ణకు స్థానం కల్పిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. అనంతరం పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను చంద్రబాబు సందర్శించారు. శొండి కులస్తులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి, ఒబిసి జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి.. చంద్రబాబుకు వినతి అందించారు. బాడంగి మండలం ఎరుకులపాకల్లో ఎరుకుల సామాజిక తరగతి ప్రజలపై వేధింపులు ఆపాలని ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పాలవలస గౌరు చంద్రబాబును కోరారు.



నూతన ఎంపిడిఒ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చంద్రబాబు మాటలు

అబద్ధాలు, అభూత కల్పనలు

- చిత్తశుద్ధి ఉంటే జిల్లాకు చేసిన అభివృద్ధి చెప్పాలి
- టిడిపి అధినేతపై మంత్రి బొత్స ఆగ్రహం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు వ్యాఖ్యలు.. అబద్ధాలు, అభూత కల్పనలేనని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కొట్టిపారేశారు. టిడిపికి జవసత్వాలు లేవని, వాటికి ఊపిరిపోసి నిలబెట్టుకునేందుకు బాబు పాకులాడుతున్నారని వ్యాఖ్యానించారు. శనివారం నగరంలో గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో చంద్రబాబు జిల్లా పర్యటన, ఆయన చేసిన విమర్శలపై బొత్స మాట్లాడారు. చంద్రబాబు ఇప్పటికైనా సోది కబుర్లు మానేసి, ఆయన హయాంలో జిల్లాకు ఏం చేశారో చెపితే బాగుంటుందని హితవుపలికారు. రాజాం, బొబ్బిలి సభల్లో ఒక్క మాట కూడా నిజం చెప్పలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని, రైతులను నిండా ముంచింది చంద్రబాబేనన్నారు. ఒకప్పుడు చంద్రబాబు రాసిన మనసులో మాట పుస్తకంలో 'వ్యవసాయం దండగ' అంటూ పేర్కొన్నారని గుర్తుచేశారు. తోటపల్లి ప్రాజెక్టును నిర్మించిందీ తామేనన్నారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు కక్ష సాధింపు చర్య వల్ల గడిచిన మూడున్నరేళ్ల వరకు రామతీర్థసాగర్ పనులు ముందుకు సాగలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రీ టెండర్లు వేసి, పనులు ముమ్మరం చేశామన్నారు. బొబ్బిలి సుగర్ ఫ్యాక్టరీని ప్రయివేట్ వ్యక్తులకు అమ్మింది చంద్రబాబేనన్నారు. గత ప్రభుత్వ హయాంలోని రూ.27 కోట్ల చెరకు బకాయిలను తాము అధికారంలోకి వచ్చాక రైతులకు ఇప్పించామన్నారు. టిడిపి హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్‌పి ప్రజలకు అందుబాటులో లేరని, ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెప్తే ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరని చెప్పారు. చంద్రబాబు హయాంలో జిల్లాలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, కొద్దో గొప్పో చిన్న పరిశ్రమలు తన చొరవతోనే వచ్చాయని వెల్లడించారు.

14 ఏళ్లలో బాబు చేసింది శూన్యం

గజపతినగరం : 14 ఏళ్లు సిఎంగా ఉన్న చంద్రబాబు జిల్లాకు చేసింది ఏమీ లేదని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం గజపతినగరంలో రూ.75 లక్షలతో నిర్మించిన నూతన ఎంపిడిఒ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెనుకబడిన జిల్లా విజయనగరంలోని బిసిలను మోసం చేసింది చంద్రబాబు కాదా? అని ప్రశ్నించారు. బిసిలను ఉద్ధరించామని చెప్తున్న చంద్రబాబు.. వెనుకబడిన తరగతులను పక్కనపెట్టి అశోక్ గజపతిరాజును కేంద్రమంత్రిగా, బొబ్బిలి రాజు సుజయ్‌కృష్ణ రంగారావును రాష్ట్ర మంత్రిగా ఎందుకు చేశారని నిలదీశారు. కార్యక్రమంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఆర్‌డిఒ శేషశైలజ, ఎంపిడిఒ కె.కిశోర్‌కుమార్, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, జెడ్‌పిటిసి గార తవుడు, తదితరులు పాల్గొన్నారు.

భగవాన్ దాస్ స్ఫూర్తితో కబడ్డీ, ఖోఖో అభివృద్ధికి కృషి

ద్రోణాచార్య అవార్డు గ్రహీత ప్రసాదరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భగవాన్‌దాస్ మాస్టర్ స్ఫూర్తితో కబడ్డీ, ఖోఖో అభివృద్ధికి కృషి చేస్తామని ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇజ్జపురెడ్డి ప్రసాదరావు తెలిపారు. జిల్లాలో కబడ్డీ, ఖోఖో పితామహుడు భగవాన్ దాస్ మాస్టర్ జయంతిని జిల్లా కబడ్డీ, ఖో ఖో అసోసియేషన్ల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కస్పా హై స్కూల్లో భగవాన్‌దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కస్పాలో శిక్షణ పొందుతున్న ఖోఖో క్రీడాకారుల ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నం నాయుడు, బొమ్మన రామారావు, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ, కబడ్డీ అసోసియేషన్ నాయకులు కాళ్ళ సూరిబాబు, పతివాడ శ్రీనివాసరావు, ఎంఎల్ఎన్ కమలనాభరావు, నగేష్, బాలకృష్ణ, సూర్యారావు, గోపాల్, హరీష్, తౌడుబాబు, రాజు, గోవింద, లక్ష్మణరావు పాల్గొన్నారు.




భగవాన్ దాస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ల సభ్యులు, క్రీడాకారులు

ప్రజలతో మమేకం కావాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు ప్రజలతో మమేకమై, పార్టీ పట్ల ఉన్న నమ్మకాన్ని మరింత ఇనుమడింప చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు. శనివారం నగరంలోని కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులను త్వరితగతిన ఏర్పాటు చేయాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పదవులు ఉన్నా, లేకపోయినా నిత్యం ప్రజలతోనే ఉండాలన్నారు. ప్రజలకు కావాల్సిన పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. కలెక్టరేట్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహం పక్కన ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటుచేసి జనవరి మూడో తేదీన ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్‌పి, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని తెలిపారు. నాయుడు ఫంక్షన్ హాల్ కూడలి నుంచి కలెక్టరేట్ జంక్షన్ వరకు 28 వెనుకబడిన తరగతుల ప్రజలతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వైసిపి పట్టణ అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్, విజయనగరం పార్లమెంట్ కార్యదర్శి ముద్దాడ మధు, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, కార్పొరేటర్ తవిటిరాజు, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ ఎస్.బంగారు నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాస రావు పాల్గొన్నారు.



వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

గడపగడపకూ కోలగట్ల

నగరంలో 36వ డివిజన్ గాంధీనగర్‌లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఆయనకు స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కాలువలు ఏర్పాటు చేయాలని, అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని స్థానికులు కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన సంబంధిత అధికారులను పిలిచి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. ఇదే పరిస్థితుల్లో విధులపట్ల నిర్లక్ష్యం వహించిన సచివాలయ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి ,డిప్యూటీ మేయర్ రేవతి దేవి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు, డివిజన్ ఇన్‌ఛార్జి కుమ్మరిగంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ బాలి పద్మావతి, చందక శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు కడగల ఆనంద్, మొయిద ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.787 కోట్లతో జెడ్‌పి అంచనా బడ్జెట్

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత : చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. అన్ని శాఖలకు కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.767.89 కోట్లతో సవరణ బడ్జెట్‌కు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.787.02 కోట్లతో అంచనా బడ్జెట్‌కు జెడ్‌పి ఆమోదం తెలిపింది. దీనిలో ప్రత్యేకంగా జిల్లా పరిషత్తు ద్వారా చేసే ఖర్చులకు రూ.13.30 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. 34 మండల పరిషత్తు బడ్జెట్లను కూడా సమావేశంలో ఆమోదించారు. శనివారం జెడ్‌పి సమావేశ మందిరంలో చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన జెడ్‌పి బడ్జెట్ సమావేశం, ఒకటో స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ముందుగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జెడ్‌పి బడ్జెట్ నుంచి ఎస్‌సిల సంక్షేమం కోసం 15 శాతం, ఎస్‌టిలకు 6 శాతం, స్త్రీ శిశు సంక్షేమానికి 15 శాతం, అభివృద్ధి పనులకు 23 శాతం, గ్రామీణ మంచినీటి సరఫరాకు 12 శాతం, కార్యాలయ నిర్వహణకు 15 శాతం, వివిధ శాఖల కార్యకలాపాలకు 10 శాతం ఆగంతక ఖర్చులకు 4 శాతం నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. జలజీవన్ మిషన్ పనులపై సమీక్షించారు. త్వరగా టెండర్లు పిలిచి, జెజెఎం పనులను పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్ బడ్జెట్ స్వరూపాన్ని సభకు వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్‌పిటిసి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్యాణమస్తుకు దరఖాస్తు చేసుకోండి

వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలకు అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. జెడ్‌పి బడ్జెట్ సమావేశానంతరం, కల్యాణమస్తు, షాదీతోఫా, పింఛన్ల పంపిణీపై చర్చించారు. సచివాలయాల్లోనే ఈ పథకాలకు దరఖాస్తు చేయించాలని ఆయన సూచించారు. వచ్చే జనవరి నుంచి పింఛను రూ.2,750కి పెరుగుతుందని చెప్పారు. పింఛను వారోత్సవాలను ప్రతీ గ్రామంలో ఘనంగా నిర్వహించాలని కోరారు. డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల గురించి, దరఖాస్తు చేసే విధానం, అర్హతలను వివరించారు. ఈ ఏడాది అక్టోబరు ఒకటో నుంచి జరిగిన వివాహాలకు ఈ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకున్న ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.లక్షా 20వేలు, బిసిలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకున్న బిసిలకు రూ.75 వేలు, ముస్లిములకు రూ.లక్ష, వికలాంగులకు రూ.లక్షా 50వేలు, నిర్మాణ కార్మికులకు రూ.40 వేలు నగదు ప్రోత్సాహకం లభిస్తుందని చెప్పారు. వివాహమైన 60 రోజుల్లోగా ఈ పథకానికి దరఖాస్తు చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

జెడ్‌పిలో క్రిస్మస్ వేడుకలు

జిల్లా పరిషత్తు ఆవరణలో డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు శనివారం జరిగాయి. చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కేక్ కటింగ్ చేశారు. జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

చక్కెర పరిశ్రమలను అమ్మేసింది చంద్రబాబే

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి, సీతానగరంలో ఉన్న సహకార చక్కెర పరిశ్రమలను అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ జాతీయం చేసి స్వాధీనం చేసుకుంటే.. టిడిపి అధినేత చంద్రబాబు ప్రయివేటీకరణ చేసి అమ్మేశారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు విమర్శించారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి సభలో చంద్రబాబు చెప్పినవన్నీ అవాస్తవాలేనని చెప్పారు. 1999లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సహకార చక్కెర పరిశ్రమలను అమ్మివేసేందుకు రెండు సార్లు టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. మొదటిసారి ఒకరు రూ.20 కోట్లకు, మరొకరు రూ.20 కోట్లా 500కు టెండర్ వేస్తే ఫైనల్ చేయకుండా రద్దు చేశారని తెలిపారు. రెండోసారి టెండర్ పిలిచి ఎన్‌సిఎస్ యాజమాన్యానికి రూ.20 కోట్లకు అమ్మేశారని ఆరోపించారు. అప్పటిలో తాను ఎమ్మెల్యేగా ఉన్నట్లు చెప్పారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.23 కోట్ల బకాయి ఉంటే, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమ భూములు అమ్మి రైతులకు బకాయిలు చెల్లించామని గుర్తుచేశారు. టిడిపిని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళి, వైసిపి పట్టణ, మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి


అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. పట్టణంలోని మూడో వార్డు పరిధిలో ప్రసాదరావు కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రతీ గడపకు వెళ్లి వైసిపి మూడేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ప్రజలను ఆరాతీశారు. స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రైతు భజనలో అధికార, ప్రతిపక్షాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏటేటా వ్యవసాయంపై భారాలు మోపుతున్న పార్టీ ఒకటి, అసలు వ్యవసాయమే దండగ అంటూ తన అంతరంగిక ఆలోచనను పుస్తకంలో రాసిన పార్టీ (చంద్రబాబు) మరొకటి. వెరసి రెండూ పార్టీలూ ఇప్పుడు రైతుల భజన చేస్తున్నాయి. అవే మన రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్షాలు. అదేనండీ వైసిపి, టిడిపి. సుదీర్ఘకాలం వ్యవసాయ రంగాన్ని విస్మరించి, సాగునీటి ప్రాజెక్టులకు కనీసం నిధులు కేటాయించని టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు గడిచిన మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా పర్యటనలో రైతుల గురించి పదేపదే ప్రస్తావించారు. రైతులను గతంలో ఆదుకున్నామని, ఇప్పుడు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం అధోగతి పాల్జేస్తోందని మొసలి కన్నీరు కార్చారు. వాస్తవానికి టిడిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దగా నిధులు కేటాయించలేదు. ఆ నిర్లక్ష్యమే జిల్లా వెనుకబాటుకు కారణమంటూ ప్రజాదృక్కోణంగల మేధావులు, రైతులు చెబుతుంటారు. అందుకు తగ్గట్టే చంద్రబాబు మాటలు కూడా ఉన్నాయి. తోటపల్లి సాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిందీ, పూర్తిచేసిందీ తానేనంటూ చంకలు గుద్దుకుంటున్నారు. వాస్తవం చెప్పుకోవాలంటే వైఎస్ఆర్ ప్రభుత్వంలోనే ఎక్కువ నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదన్న విషయం పాపం బాబుగారికి తెలియదేమో! దీని సంగతి పక్కనబెడితే అత్యంత నిర్లక్ష్యానికి గురైన రామతీర్థసాగర్ గురించి బాబు ప్రస్తావించేందుకు సంకోచించారు. పెద్దగెడ్డను హడావుడిగా ప్రారంభించినా ఇప్పటికీ



నిర్వాసితులకు న్యాయం జరగలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే సాగు భారం మొదలుకుని, సాగునీటి సమస్యల వరకు ఎన్నో ఇబ్బందులు రైతులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు రైతులను ఉద్ధరిస్తానంటూ ప్రగల్భాలాలు పలకడంతో నమ్మలేకపోతున్నామని వ్యవసాయ కుటుంబాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇటు తామేమీ తక్కువ కాదన్నట్టుగా వైసిపి నేతలు కూడా రైతుల క్షేమం గురించి మాట్లాడుతున్నారు. చంద్రబాబు డాబులకు ఉలిక్కిపడ్డ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ రైతుల ఉద్ధారకులం తామేనంటూ పల్లవి అందుకున్నారు. ఆయన హయాంలో ఎంతో కొంత రైతాంగానికి మేలు జరిగిన మాట కాదనలేకపోయినప్పటికీ, ఇప్పుడు చెబుతున్నట్టు రైతులేం అంత సుభిక్షంగా లేరు. వ్యవసాయ రంగంలో జరగాల్సినంత అభివృద్ధేమీ జరిగిపోలేదు. రైతుల కష్టాన్ని పెట్టుబడిదారులకు తాకట్టుపెడుతూ పార్లమెంటులో బిల్లుపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి వంతపాడుతున్న వైసిపిని ఎలా నమ్మగలం? అని రైతాగం ప్రశ్నిస్తోంది. ఆ మాటకొస్తే ఉచిత వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తూచ తప్పకుండా అమలు చేస్తున్నదీ మన జగన్ సర్కారే. దీనిపై చంద్రబాబు చేసిన విమర్శలకు ఉలిక్కపడ్డ మంత్రి బొత్స రైతులు వినియోగిస్తున్న విద్యుత్తును లెక్కించేందుకే మీటర్లు పెడుతున్నామంటూ సమర్థించుకున్నారు. వాస్తవమేమంటే ఉచిత విద్యుత్తుకే ఎసరుపెట్టాలన్న ప్రపంచ బ్యాంకు షరతులవి. అందుకని రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి విషయంలో దొందూ దొందేనని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో రైతుల జపం చేస్తున్నాయని వ్యాఖ్యానిస్తోంది.

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా చింతల

ప్రజాశక్తి-రామభద్రపురం



చింతల రామకృష్ణ

రామభద్రపురం మేజరు పంచాయతీ ఉపసర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు చింతల రామకృష్ణ ఆ పార్టీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బొబ్బిలిలో జరిగిన రైతుసభలో ఆయనకు టిడిపి అధినేత చంద్రబాబు నియామకపత్రం అందజేశారు. ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉద్యోగం చేస్తూ టిడిపి విధానాల పట్ల ఆకర్షితులైన రామకృష్ణ ఉద్యోగం వదిలి పార్టీలో చేరారు. తనదైన శైలిలో గ్రామాభివృద్ధికి శ్రమించారు. క్లిష్ట సమయంలో పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. దీంతో ఆయన సేవలను గుర్తించిన చంద్రబాబు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించారు. ఈ సందర్భంగా చింతల రామకృష్ణ మాట్లాడుతూ తనకు పదవి దక్కడానికి కృషి చేసిన టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయనకు, మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పురోభివృద్ధికి మరింత కృషి చేసేందుకు అవకాశం కలిగిందన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే పరీక్ష పే

శృంగవరపుకోట : 9 నుండి 12వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు తగు సూచనలు అందించి ప్రోత్సహించేందుకు పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని మండల విద్యాశాఖాధికారి పెంట సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని విద్యా వనరుల కార్యాలయంలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సాధారణంగా పరీక్షల సమయంలో చాలామంది విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారని దీంతో ప్రిపరేషన్ పై పూర్తిగా దృష్టి సారించలేక ఇబ్బందులు పడుతుంటారని ఈ పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎదుర్కొనేలా విద్యార్థులకు సూచనలు అందించి ప్రోత్సహించేందుకే పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జనవరి నెలలో ఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలోని టౌన్ హాల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడతారని విద్యార్థులు పరీక్ష సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరిస్తారని చెప్పారు.



బాధిత మహిళకు చెక్కును అందిస్తున్న నాయకులు

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

రేగిడి : మండలంలోని అప్పాపురం గ్రామానికి చెందిన తిరుమరెడ్డి వెంకటరాజు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు వెంకటరాజు భార్యకు వైస్సార్ భీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు చెక్కును శనివారం వైసిపి నాయకులు కరణం శ్రీనివాసరావు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సుప్రియ, పంచాయతీ కార్యదర్శి ఆశ స్వాతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

డాక్టర్ చిట్టి రమణారావు వితరణ



చెక్కును అందిస్తున్న వైద్యులు రమణారావు

నెల్లిమర్ల : కేన్సర్ రోగికి డాక్టర్ చిట్టి రమణారావు శనివారం ఆర్థిక సాయం అందించారు. సతివాడ గ్రామానికి చెందిన లెంకహరి నాయుడు బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో వెంకట రామా హాస్పిటల్ యజమాని డాక్టర్ చిట్టి రమణారావు తన కుమారుడు చిట్టి వైష్ణవ్ చారిటబుల్ ట్రస్టు పేరిట రూ.50వేలను రోగి తండ్రి లెంక ఆదినారాయణకు అందించారు. ఈ కార్యక్రమంలో సతివాడ సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ పాల్గొని డాక్టర్ చిట్టి రమణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అడిషనల్ జిల్లా జడ్జి కోర్టు సందర్శన

గజపతినగరం : ఎడిషనల్ జిల్లా జడ్జి ఎం. మీనాదేవి గజపతినగరం కోర్టును శనివారం సందర్శించారు. కోర్టు తనిఖీలో భాగంగా ఆమె పలు అంశాలపై గజపతినగరం జడ్జి బి. కనకలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బార్ రూంలో న్యాయ వాదులతో కేసుల గురించి ముచ్చటించారు. న్యాయవాద కేసుల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనివాసనాయుడు, సెక్రెటరీ పొట్నూరి శ్రీను, సీనియర్ న్యాయవాదులతో సహా న్యాయవాదులందరూ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ ఐజాక్

ధాన్యం కొనుగోలులో అలసత్వం వద్దు

వంగర : రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని తహశీల్దార్ డి. ఐజాక్ అన్నారు. ఈ మేరకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు సాంకేతిక సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేపట్టేందుకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి బలివాడ గోవిందరావు, డిటి సుందర రావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

భోగాపురం : రెవెన్యూ కార్యాలయంలో శనివారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆంగ్ల వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో భోగాపురం మోడల్ స్కూల్ చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, కళాశాల స్థాయి ఆంగ్ల వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో జిల్లా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ సి. పార్వతి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించార.

'సీతం' విద్యార్థులతో ఎంసిఎం ముఖాముఖి

విజయనగరం : సీతం ఇంజినీరింగ్ కళాశాలను ప్రముఖ యుట్యూబర్ మిడిల్ క్లాస్ మధు (సాయి), సీనియర్ జర్నలిస్ట్ జాఫర్ సందర్శించారు. వీరిద్దరూ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. యూట్యూబ్ ఛానల్ విజయవంతం కావడానికి సలహాలను తెలియజేశారు. అనంతరం మధు, ఆయన తల్లితండ్రులు, జాఫర్‌ను సీతం కళాశాల యాజమాన్య ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపల్ డి.వి.రామ్మూర్తి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సాయి, జాఫర్ ఎఒ, ప్రిన్సిపల్

ఉపాధ్యాయుల సమస్యలపై 26న ధర్నా

విజయనగరం టౌన్ : ఉపాధ్యా యుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించ నున్నామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలన్నారు. ఎల్ఐసి, ఎపిజిఎల్ఐ రుణాలు మంజూరు చేయాలని, డిఎ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేయాలని, సిఫార్సు బదిలీలు ఆలోచన విరమించుకోవాలని కోరారు. వీటిపై చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు ఎ.సదాశివరావు, ఆర్.కృష్ణ, ఎన్‌వి పైడిరాజు, ఎవి శ్రీనివాసరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వాచ్‌మెన్లను నియమిస్తాం


ప్రజాశక్తి - మెరకముడిదాం, బొండపల్లి

రాష్ట్రంలో తొలివిడత నాడు - నేడు పాఠశాలల్లో వాచ్‌మెన్‌లను నియమించనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఆయా పాఠశాలల్లో నాడు - నేడు కింద విలువైన పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని, దీనితోపాటు ఇంటరాక్టివ్ విద్యాబోధనలో భాగంగా టీవీలు కూడా ఏర్పాటు చేస్తున్నందున ఆయా పరికరాల భద్రత కోసం వాచ్‌మెన్లను నియమిస్తామని చెప్పారు. బొండపల్లి, మెరకముడిదాం జిల్లా పరిషత్తు పాఠశాలల్లో శనివారం ఆయన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల భర్తలకు ఈ వాచ్‌మెన్ పోస్టు ఇస్తామన్నారు. ఆయాలు లేని పక్షంలో మాజీ సైనికులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం మెనూపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం మెనూలో అందిస్తున్న సాంబారు సరిగా వండటం లేదని, అందువల్ల పిల్లలు భోజనం చేయలేకపోతున్నట్లు తల్లిదండ్రులు మంత్రికి వివరించారు. దీంతో గురువారం మెనూ మార్చే విషయం పరిశీలిస్తామన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నామని ఇందులో భాగంగానే విద్యార్థులకు ట్యాబ్‌లు అందించామని చెప్పారు. రాష్ట్రంలో రూ.600 కోట్లతో 4.80 లక్షల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లో 8,9 తరగతుల సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యాంశాలు ఆంగ్లంలో, తెలుగులో కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్నెట్ లేనప్పటికీ ఆఫ్‌లైన్‌లో ట్యాబ్‌ను విద్యార్థులు సులభంగా వినియోగించేందుకు వీలుగా రూపొందించామన్నారు. విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లను ఇతర అవసరాలకు వినియోగించకుండా చూసేందుకు తగిన మార్పులు చేశామన్నారు. విద్యార్థులు ఇంటి వద్ద ఎంత సమయం ట్యాబ్ వినియోగించిందీ, ఏయే పాఠ్యాంశాలు చదువుతున్నారో తెలుసుకొనేందుకు వీలుగా ట్యాబ్‌లో ఏర్పాట్లు చేశామన్నారు. ట్యాబ్‌లు ఏమైనా మరమ్మత్తులకు గురైతే మూడేళ్ల వరకు వాటిని మరమ్మత్తులు చేసి వాటిని వినియోగించేలా చేసే

మంత్రి బొత్స సత్యనారాయణ



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

బాధ్యత ప్రభుత్వమే వహిస్తుందని మంత్రి తెలిపారు.

నెలాఖరులోగా ట్యాబ్‌లు అందించాలి : డిఇఒకు మంత్రి ఆదేశాలు

జిల్లాలో మంజూరైన ట్యాబ్‌లను ఈ నెలాఖరులోగా విద్యార్థులకు అందజేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ డిఇఒను ఆదేశించారు. ఆయా ట్యాబ్‌లలో కంటెంట్ లోడ్ చేసి విద్యార్థులకు అందించాలన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నాడు - నేడు తొలివిడత పూర్తయిన పాఠశాలల్లో 6వ తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 1.50 లక్షల తరగతి గదుల్లో ఈ ప్యానల్స్ ఏర్పాటు చేస్తామన్నారు.అనంతరం విజయనగరం డివిజన్‌లో జగనన్న భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా సమగ్ర భూసర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాలను ఆయన పంపిణీ చేశారు.

కామన్వెల్త్ స్వర్ణపతక విజేత అనిల్‌కు సత్కారం

బొండపల్లి మండలం చామలవలస గ్రామానికి చెందిన పవర్ లిఫ్టర్ బోదంకి అనిల్ కుమార్ ఇటీవల న్యూజిలాండ్‌లో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని నాలుగు స్వర్ణాలు గెలుచుకున్న సందర్భంగా మంత్రి ఆ క్రీడాకారుడిని శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థులంతా అనిల్‌ను స్ఫూర్తిగా తీసుకొని తమకు ఆసక్తి వున్న రంగాల్లో రాణించాలని సూచించారు. అనిల్ రానున్న రోజుల్లో ప్రపంచ స్థాయిలో రాణించేందుకు మరిన్ని వసతులను కల్పించే విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, గజపతినగరం స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, జెసి మయూర అశోక్‌కుమార్, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, డిఇఒ లింగేశ్వర రెడ్డి, సమగ్రశిక్ష పిఒ స్వామినాయుడు, బొండపల్లి ఎంపిపి చల్లా చంద్రయ్య నాయుడు, జెడ్‌పిటిసి సూర్యప్రకాశరావు, ఎఎంసి చైర్మన్ ముత్యాల నాయుడు, ఎంపిడిఒ వేదావతి, తహశీల్దార్ శ్రీనివాస మిత్రా పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



దెంకాడ: ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపిపి

దెంకాడ : మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం సిఎం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. ఇప్పటి నుంచే ఇంగ్లీష్‌లో ముందు వరుసలో ఉంటే పదవ తరగతి ఇంటర్మీడియట్‌కు వెళ్లేటప్పటికీ విద్యార్థులు ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడగలుగుతారని అందుకే ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వడం జరిగిందని అన్నారు. వీటిని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముద్దాడ రాము, ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్యా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వావిలపాడు, నల్లబిల్లిలో హౌసింగ్ డే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో శనివారం వావిలపాడు నల్లబెల్లి గ్రామాల్లో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి మాట్లాడుతూ జగనన్న కాలీనల్లో ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని లేకపోతే వారి వద్ద నంచి తీసుకుని ఇళ్ల స్థలాలను తీసుకుని వేరే వ్యారికి కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్ఎన్‌కె పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి, హౌసింగ్ ఎఇ, మండల వ్యవసాయ శాఖ అభివృద్ధి కమిటీ చైర్మన్ వీళ్లే సన్యాసినాయుడు, వావిలపాడు ఎంపిటిసి చిన్నమ్మలు, పిఆర్ జెఇ, ఎపిఎం తదితరలు పాల్గొన్నారు.

భోగాపురం: జగనన్న కాలనీలో ఇల్లు నిర్మాణం వేగవంతం చేయకపోతే ఇల్లు పట్టాలు రద్దు అవుతాయని మండల ప్రత్యేక అధికారి ఎస్ పద్మావతి అన్నారు. శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా చిన్నకొండరాజు పాలెం హౌసింగ్ లేఔట్ ను పరిశీలించి లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న సర్పంచ్ బీల రాజేశ్వరి

త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. తదుపరి సఖీ గ్రూపులతో సమావేశం ఏర్పాటు చేసి, చైల్డ్ మేరేజస్ గూర్చి, బేడ్ టచ్, గుడ్ టచ్ గూర్చి అవగాహన కల్పించారు. అక్కడ ఉన్న ప్రజలతో కరోనాపై ర్యాలీ ఏర్పాటు చేసి, కరోనా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బంగారయ్య, హౌసింగ్ ఎఇ రొంగలి రాము, ఎపిఎం రమణ, ఎపిఒ ఆదిబాబు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

74 మందికి వైద్య సేవలు

కొత్తవలస : వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని సీతంపేటలో వై.ఎస్ఆర్. ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్‌లో భాగంగా శనివారం ఉచిత వైద్య సేవలు అందించారు. వైద్యాధికారులు డాక్టర్ బి. సింహాద్రి నాయుడు, డాక్టర్ టి. వెంకటరావులు 74 మందికి వైద్య సేవలు అందించారు. గ్రామ సర్పంచ్ విరోతి కొండలరావు చేతులు మీదుగా 6 గురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం వల్ల ఇంటి దగ్గరికే వైద్య సేవలు అందించడం ఆనందించ దగ్గ విషయం అని అన్నారు. అనంతరం బీపీ, షుగర్, హెచ్.బి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ముగ్గురు బాలింతలు, ముగ్గురు పక్షవాతం రోగులకు ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. అంగన్వాడీ సెంటర్ విజిట్ చేసి పిల్లలకి వయసుకి తగిన ఎత్తు, ఎత్తుకి తగిన బరువు ఉన్నారా లేదా అని ఆరోగ్య తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందించారు. రక్తహీనత రాకుండా ప్రతీ సోమవారం, శనివారం ఐరన్ ఫోలిక్ సిరప్ మింగాలని తెలిపారు. కడుపులో నులి పురుగులు రాకుండా ప్రతీ మూడు నెలలు కొకసారి ఆల్బెండాజోల్ మాత్రలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ రాము, ఎంఎల్‌హెచ్‌పి కామేశ్వరి, ఏఎన్ఎమ్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, డేటా ఆపరేటర్ సత్యనారాయణ, పైలట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

కబడ్డీ విజేత జట్టుకు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన జట్టుకు ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు అభినందించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన నియోజకవర్గ మహిళా కబడ్డీ క్రీడాకారులను ఎమ్మెల్యే ఆయన అభినందించార. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, క్రీడా రంగాల్లో మరింత ప్రోత్సాహం అందిస్తుందని, జిల్లాకు మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్య నారాయణ, నగర పంచాయతి వైస్ ఛైర్మన్‌లు రామారావు, కారు కొండ కృష్ణ, వైసిపి నాయకులు చిక్కాల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

రైతులకు అండగా జనసేన

నెల్లిమర్ల : రైతులకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గం నాయకులు లోకం మాధవి స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి రైతు దినోత్సవం సందర్భంగా దుర్గాసి శేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని గుషినిలో జనసేన నాయకులు పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడతూ జన సేన రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశానికి, సమాజానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతు సమస్యలను అధికార వైసిపి పట్టించుకోలేదని విమర్శించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పంట సేకరణలో అవకతవకలు ఉన్నట్లు రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలులో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అచ్చుం నాయుడు, నాయకులు కల్యాణం అనిల్, బొమ్మలాట గురుమూర్తి, మొయిద లక్ష్మణరావు, వి. రమణ, జి. త్రినాధ్, సారిపల్లి శంకర్, జగదీష్, ఆల్తి దుర్గా ప్రసాద్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లోకం మాధవి

గడపగడపకులో పథకాలపై ఆరా

ప్రజాశక్తి - శృంగవరపుకోట

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలపై ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరా తీశారు. మండలంలోని తిమిడి గ్రామ సచివాలయం పరిధిలో వసి గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా జగనన్న పాలనలో అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, పోతానాపల్లి వెంకటరావు, ఏఎంసి. డైరెక్టర్ డి. పార్వతీ, మోపాడ కోటి, స్థానిక సర్పంచ్ ఒబ్బిన పార్వతి, ఒబ్బిన బంగారు నాయుడు, వైస్ సర్పంచ్ కాకర చినతల్లి, ఎంపిటిసి ధర్మారావు, కె.వెంకటరావు, బత్తిన వెంకటరావు, పిల్లా రమణ, పాపల కృష్ణ, గోకెడ అప్పలనాయుడు, చమలాపల్లి సర్పంచ్ సూర్యారావు, ఎంపిటిసి కడారి అప్పయ్య, ఉల్లి శంకర్, నాగరాజు, కర్రి భార్గవ్, కొట్టాం వెంకటరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

272 ఆటోలతో చంద్రబాబు సభకు..

ప్రజాశక్తి - వేపాడ

టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు నాయకత్వంలో జిల్లా కేంద్రంలో జరిగిన చంద్రబాబు బహిరంగ సభకు 272 ఆటోల్లో కార్యకర్తలు తరలి వెళ్లారు. ఎన్నారై గొంప కృష్ణ సహకారంతో గొంప వెంకటరావు, గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, మాజీ సర్పంచ్ గొర్లె నాగరాజు, సేనాపతి అప్పారావు, టి. కృష్ణ, సిరికి సూర్యనా రాయణ, సిరికి రమణ, వై.సూర్యం ఆధ్వర్యంలో సభకు వందలాది మంది తరలివెళ్లారు.

భోగాపురం : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విజయనగరం బహిరంగ సభకు భారీ ఎత్తున కార్యకర్తలు నాయకులు బయలుదేరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగారురాజు, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారా యణ ఆధ్వర్యంలో భోగాపురం మండలం నుండి సుమారు 300 ఆటోలతో కోట సమీపంలో జరిగిన బహిరంగ సభకు వెళ్లారు. చంద్రబాబు సభలకు జనం బ్రహ్మరథం పడుతున్నారని కర్రోతు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి అప్పలస్వామి, కర్రోతు రాజు, నీలాపాలరామిరెడ్డి, రామసూరి, ముఖ్య నేతలు అంతా పాల్గొన్నారు.



బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి - కొత్తవలస

సమాజంలో పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వెలుగు మండల సమైఖ్య ఎపిఎం జి. శ్రీనివాసరావు ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని వెలుగు మండల సమైఖ్య కార్యాలయంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 22వ తేదీ నుండి డిసెంబర్ 23వ తేదీ వరకు గ్రామాల్లో లింగ వివక్షతను రూపుమాపడం, లైంగిక నేరాలు నుండి పిల్లలకు రక్షణ, లైంగిక నిరోధక చట్టంపై అవగాహన, కిషోరీ బాలల సంఘాలు ఏర్పాటు, బాల్య వివాహాలు అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య అధ్యక్షులు ఈటి ఉమా మహేశ్వరిని దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైఖ్య సిబ్బంది, సీసీలు పాల్గొన్నారు.



ఉమా మహేశ్వరిని దుశ్శాలువాతో సత్కరిస్తున్న ఎపిఎం

ఆన్‌లైన్ కొనుగోళ్లలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో ప్రజలు ఎక్కువగా ఆన్‌లైన్ ద్వారా తమకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తున్నారని అటువంటి ఆన్‌లైన్ కొనుగోలుపై జాగ్రత్తలు వహించాలని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుల కనకల శివ తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వివేకానంద కళాశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు గోవిందు ప్రకాష్, నియోజకవర్గ కార్యదర్శి ముగ్గు ధర్మారావు, కోశాధికారి గనివాడ బాపు నాయుడు, మండల అధ్యక్షులు ఇందుకూరి కృష్ణంరాజు, ఇతర సిఆర్ఒ సభ్యులు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించిన డిఎఫ్ఒ



మొక్కలు నాటుతున్న వినయ్

శృంగవరపుకోట : పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖాధికారి కె.వినయ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భం గా అగ్నిమాపక కేంద్రం ఆవరణలో షటిల్ కోర్టును ప్రారంభించారు. మామిడి, సపోటా మొక్కలను నాటారు. అనంతరం అగ్నిమాపక కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా అగ్నిమాపక సిబ్బంది నుండి జిల్లా ఫైర్ అధికారి వినయ్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్థానిక అగ్నిమాపక అధికారి షేక్ మదీనా, సిబ్బంది పాల్గొన్నారు.



శృంగవరపుకోట: వివిధ వేశధారణలో పిల్లలు

ఘనంగా ముందస్తు క్రిస్మస్

ప్రజాశక్తి - శృంగవరపుకోట

క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని కౌముది గ్లోబల్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు శాంతి మహంతి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఆట పాటలతో అలరించారు. మండలంలోని భవాని నగర్‌లో గల డివిఎల్ స్కూల్, గౌరీ విద్యానగర్‌లలో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విజయనగరం టౌన్ : స్థానిక నారాయణ పాఠశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన వేశధారణలు పలువురును ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాలలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

నగరంలోని వైసిపి క్రైస్తవ మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొని కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.



వివిధ వేషధారణలో నారాయణ విద్యార్థులు



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి